జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలో గల కుమడ గ్రామ సచివాలయలలో ఎంపీ డీవో ఆర్వీఎస్ రమేష్ ఆధ్వర్యంలో, కరిముక్కిపుట్టులో తహశీల్దార్ నరసమ్మ ఆధ్వర్యంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. ఆయా పంచాయితీ పరిధిలో 200 కుల, ఆదాయ, ధృవపత్రాలు అందించడం జరిగిందన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బోరగం భాగ్యవతి, పూలమొత్తి, ముత్తమ్మ, వైస్ ఎంపీపీ సీర్గం భాగ్యవతి, ఎంపిటిసిలు కమల, రాములమ్మ, ఈఓపిఆర్డి వి.చిన్నన్న, పంచాయతీ కార్యదర్శులు గోవి సింహాచలం, వైసీపీ నేతలు కొండలరావు, ఎం.సురేష్, జి.అర్జున్, జయదేవ్, ముఖి రాంప్రసాద్, ఎస్.తిరుపతి, జోగారావు పాల్గొన్నారు.

రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ జవహర్‌లాల్ ఫార్మాసిటీలోని రాంకీ యాజమాన్యంపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాంకీ సీఈటీపీ చిమ్నీల్లో నుంచి ప్రమాదకరమైన కాలుష్యాన్ని విడుదల చేస్తోందని ఆరోపించారు. బుధవారం రాత్రి 9గంటల నుండి రెండు గంటపాటు కాలుష్యాన్ని విడుదల చేయడంతో సమీపంలోని తానాం గ్రామానికి చెందిన ప్రజలు ముక్కు మండటం, కళ్ళు తిరగడం, వికారం వంటి లక్షణాలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ విషయమై వెంటనే తాను పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈఈ వెంటనే స్పందించి రాత్రి 12 గంటల సమయంలో ఇక్కడకొచ్చి మిషన్‌తో పరీక్షలు నిర్వహించి కాలుష్యం విడుదలైనట్లు నిర్ధారించారని గనిశెట్టి తెలిపారు. రాంకీ యాజమాన్యం చిమ్నీల ద్వారా కాలుష్యాన్ని వదిలేయడమే కాకుండా సమీపంలో ఉన్న ఊరచెరువులోకి వ్యర్థ జలాలను నిర్లక్ష్యంగా విడిచిపెడుతుందని ఆరోపించారు. కాలుష్యాన్ని నియంత్రించి దానికి కారణమైన రాంకీ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రాంకీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని గనిశెట్టి హెచ్చరించారు.

రోడ్డు బాగు చేయాలంటూ జనసేన నిరసన

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం ఎం.కోటపాడు గ్రామం నుండి ఎం.కోడూరు గ్రామం వరకు మరమ్మతులకు గురైన రోడ్డును బాగు చేయాలంటూ గురువారం ఎం.కోటపాడు వద్ద జనసేన సైనికులు శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ నాయకులు రాయపురెడ్డి కృష్ణ మాట్లాడుతూ ఈ రోడ్డుకు పెద్దపెద్ద గుంతలు పడి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని, ఈ రోడ్డుపై వాహనాలు నడిపే అవకాశం కూడా లేకుండా పోయిందని తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారులు వెంటనే ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు అభిమానులు పాల్గొన్నారు.

పాడికి ఆధారం పచ్చి మేత

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం రేవిడి పంచాయితీ రౌతులపాలెం గ్రామం రెడ్డి వారి కల్లాలలో గురువారం పాడి పశువుల అభివృద్ధిపై సదస్సు నిర్వహించారు. పాండ్రంగి పశు వైద్యాధికారి డాక్టర్ ఆరులు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.రామకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎన్.కరుణాకర్ రావు మాట్లాడుతూ పాడి రైతులకు ప్రభుత్వపరంగా అందజేస్తున్న సౌకర్యాలు పలు పథకాలు రాయితీలను తెలియజేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి వెంకటరమణ మాట్లాడుతూ పశు బీమా ప్రయోజనం, దాని ఆవశ్యకత గురించి వివరించారు. గడ్డి కోసే యంత్రాలు కేవలం 20,000కే లభిస్తున్నాయని అన్నారు. అనంతరం పశు బీమా చేయించుకున్న రైతులకు బీమా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పెషల్ ఫ్యాకల్టీ డాక్టర్ మదీనా ప్రసాద్, ఎంపీటీసీ ఎస్.సూరప్పుడు, నాయకులు కోన రమణ, రేవిడి ఏహెచ్ఏ బూర్ల అప్పల కృష్ణ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో నక్కపల్లి, చినదొడ్డిగల్లు, వెదుళ్ళపాలెం గ్రామాల్లో నాడు నేడు (ఫేజ్-॥) క్రింద అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవన నిర్మాణ పనులకు సంబంధించి పాయకరావుపేట నియోజకవర్గ శాసన సభ్యులు, ఎస్సీ ఎస్టీ అసెంబ్లీ వెల్ఫేర్ కమిటి చైర్మన్ గొల్ల బాబూరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ నక్కపల్లి, చినదొడ్డిగల్లు, వెదుళ్ళపాలెం గ్రామాల్లో 48 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. తక్షణమే పనుల ప్రారంభించాలని ఐసిడిఎస్ పివో శ్రీవిద్యకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పోరేషన్ డైరెక్టర్, రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపిపి ఏనుగుపల్లి రత్నం, జెడ్‌పిటిసి గోసల కాసులమ్మ, వైఎస్ ఎంపిపి వీసం నానాజీ, సర్పంచ్ నేతల జయ రత్నకుమారి, పలువురు వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో డిజిటల్ టెక్నాలజీ పెంపొందించాలి

కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరిచే దిశగా ఉపాధ్యాయులు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి ఆదేశించారు. గురువారం గుండాలు దగ్గర గల సచివాలయ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కూల్ ఆవరణ, తరగతి గదులలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా పారిశుధ్యం - పరిశుభ్రత పక్కాగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యాబోధనలో అవసరమైన మార్పులు చేసి విద్యార్థులలో జిజ్ఞాసను కలిగించడం, ఆసక్తి పెంచడం ద్వారా ప్రజ్ఞను వెలికి తీయాలన్నారు. విద్యార్థులలో అవగాహన స్థాయిని తెలుసుకునేందుకు 3 నుంచి 10 వ తరగతి విద్యార్థులకు వారాంతపు పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థులలో డిజిటల్ టెక్నాలజీ వినియోగం పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట రమణమ్మ, ఏ.డి. రవిబాబు, మండల విద్యాశాఖ అధికారులు, ఏపీ డబ్ల్యు ఐడిసి జె.ఇ. ప్రసాద్, సర్వశిక్షా అభియాన్ ఈ.ఈ. నారాయణరావు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కంచు గుర్రాలకు శతవసంతోత్సవ సంబరాలు

విశాలాంధ్ర - కే.కోటపాడు: అమ్మవారి పండుగల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఊరేగింపుల్లో అగ్ర భాగాన ఉంటూ భక్తులను గుడికి తీసుకువెళ్లే కంచు గుర్రాలు, ఏనుగుకు నేటితో 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం కే.కోటపాడులో నిర్వాహకులు భారీ ప్రదర్శన ఊరేగింపు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు ఆయురారోగ్యాలతో, కష్ట నష్టాలకు గురికాకుండా ఉండేందుకు ఆదిశక్తి స్వరూపాలైన అమ్మవార్ల ఆలయాలను కొన్ని వందల ఏళ్ళ క్రితం గ్రామ పొలిమేరల్లో నిర్మించేవారు. వివిధ రకాల పేర్లతో పిలుస్తున్న అమ్మవారి పండుగలను ప్రతి ఏటా గ్రామస్తులు ఘనంగా జరుపుకుంటారు. అమ్మవారికి పసుపు కుంకుమలు ఇచ్చేందుకు వెళ్లే ప్రదర్శనలో ఊరేగింపునకు ముందు భాగాన అలంకరించిన కంచు గుర్రాలు ఏనుగును తీసుకువెళ్తుంటారు. వీటిని తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా శెట్టిబలిజ కులస్తులు ఉన్నారు. 100 సంవత్సరాల క్రితం ఆరేడు కుటుంబాలకు చెందిన శెట్టిబలిజ కులస్తులు రెండు కంచుగుర్రాలు ఒక ఇత్తడి ఏనుగు అప్పటి పెద్దల సహకారంతో తయారు చేయించారు. అమ్మవారి సేవలో తాము కూడా ముందు భాగాన ఉంటామన్న భావంతో వీటిని ఏర్పాటు చేశారు. వీటిని ఉంచడానికి ప్రత్యేకంగా గుర్రాల చావడి అనే భవనాన్ని కూడా నిర్మించారు. గుర్రాల ఊరేగింపు లేనిదే అమ్మవారి పండుగ పరిపూర్ణం కాదు. వీటికి నేటితో నూరు సంవత్సరాలు పూర్తవడంతో గ్రామంలో తీన్మార్ డప్పులు, భారీ మందుగుండు సామగ్రితో ఊరేగింపు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ ప్రదర్శనలో మాది బోయిన, రెడ్డి, సమ్మెంగ, కండిపల్లి, గండిబోయిన కుటుంబాల వారు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూతకై మెప్మా బజార్లు

విశాలాంధ్ర - యలమంచిలి: పట్టణ మున్సిపాలిటీ ధర్మవరం వీధిలో గల శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన వివిధ ఉత్పత్తులను గురువారం ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు, పి.డి.సరోజినిలు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే, మాజీ డీసీసీబీ చైర్మన్ సుకుమార్ వర్మ తేజ, ఎంపిపి బోదెపు గోవిందలు స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేస్తుందని, ఇక్కడ అందుబాటులో ఉంచిన వివిధ ఉత్పత్తులు ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్లు గుప్తా, నాగేశ్వరరావు, ఐబి వరలక్ష్మి, సీఎంఎం పద్మావతి, కౌన్సిలర్లు పిట్టా సత్తిబాబు, హరినాథ్, కో-అప్షన్ సభ్యులు దూది నర్సింహమూర్తి, వైసిపి నాయకులు పిల్లా త్రినాథ్, మర్రి రాజు, ఎస్‌హెచ్‌జి సభ్యులు, ఓబీలు పాల్గొన్నారు.

కుంభా రవిబాబు దృష్టికి పలు సమస్యలు

విశాలాంధ్ర - అరకులోయ: అరకులోయ అసెంబ్లీ నియోజక వర్గంలో నెలకొన్న పలు సమస్యలపై గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థి కుంభా రవిబాబు దృష్టికి తీసుకువెళ్లారు. గురువారం విశాఖపట్నం ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి సుదీర్ఘంగా చర్చించి వివరించినట్లు నియోజకవర్గ వైయస్సార్ టీం వర్కింగ్ అధ్యక్షులు, పెదలబుడు మాజీ సర్పంచ్, అరకులోయ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సమర్ధి రఘునాథ్ తెలిపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ పలు సమస్యలపై వివరించారు. అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సమర్ధి రఘునాథ్ పేర్కొన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను కలుపుకొని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అరకులోయ అసెంబ్లీ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి ప్రతిఒక్కరు సైనికుల్లా పని చేయాలని అన్నారు. రవిబాబుని కలిసిన వారిలో వైసీపీ సీనియర్ నాయకులు పెట్టెలి సుక్ర పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - విశాఖ: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని జోన్ వన్ ట్రాఫిక్ ఏసీపీ మనోహర్, జోన్ 2 ఏసీపీ జి.రాజీవ్ కుమార్, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆటో డ్రైవర్ల సదస్సు గురువారం జి.వామన మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రశాంత విశాఖ నగరంలో డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్న సంఘ విద్రోహశక్తుల సమాచారాన్ని పోలీసులకు అందించాలని ఆటో డ్రైవర్లను కోరారు. ఆటోలపై ఉన్న పోలీస్ ఈ చలానాలు, పార్కింగ్ స్థలాలపై ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ ఎం. బుచ్చిరాజు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఐక్యమత్యంతో హక్కులు సాధించుకోవచ్చని అన్నారు. ఆటో మీటర్ తొలగించడం, ఆటో డ్రైవర్ బ్యాడ్జి నెంబర్లు తొలగించడం వంటివి పోరాటాల ద్వారా సాధ్యపడ్డాయని అన్నారు. వైసీపీ ఉత్తర నియోజకవర్గం ఇన్చార్జి కేకే రాజు మాట్లాడుతూ వాహన మిత్ర, అమ్మ ఒడి పథకాల ద్వారా ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అండగా ఉందని అన్నారు. విద్యలో మెరిట్ సాధించిన ఆటో డ్రైవర్ల పిల్లలు, పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో, కాలేజీల్లో 25శాతం సీట్లను కేటాయించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ రవాణా రంగంలో పనిచేస్తున్న ఆటో అండ్ మోటార్ వాహన డ్రైవర్ల కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించే సంక్షేమ బోర్డు సాధనకై ఆటో డ్రైవర్లు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షవహించిన జి.వామనమూర్తి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లపై ఉన్న పోలీస్ పెండింగ్ ఈ చలనాలు రద్దు చేయాలని, పీఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి పడాల గోవింద, రవికృష్ణ, వివి కృష్ణ, ఎస్.మధు రెడ్డి, శివ, వై.వెంకట్, ఆర్టీసీ కాంప్లెక్స్ శ్రీనివాసు, ఎంఏ ఖాన్, లక్ష్మణ్, శివాజీ, నాగరాజు, అప్పలరాజు పాల్గొన్నారు.

నామవరంలో తాగునీటి సరఫరా పునరుద్ధరణ

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని నామవరం గ్రామంలో తాగునీటి పునరుద్ధరణకు పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. గురువారం నుండి గ్రామంలో యథావిధిగా రక్షిత మంచినీటి సరఫరా పథకం నుండి తాగునీటి సరఫరా జరుగుతుందని గ్రామ సర్పంచ్ భర్త కురందాసు శివ తెలిపారు. నామవరంలో దాహం కేకలు అనే కథనం ఇటీవల విశాలాంధ్రలో ప్రచురితమైంది. కథనానికి స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సాంబశివరావుకు, ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈ మనోజ్‌కళ్యాణ్‌లకు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు గ్రామానికి తాగునీరు అందించే

పాయకరావుపేట నుండి నామవరం గ్రామానికి వెళ్లే పైపులైను పూర్తిగా ధ్వంసంమైన గుర్తించిన అధికారులు సత్వరగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అందించారు.

దీంతోపాటు పైపులైను ఎక్కడ పూర్తి స్థాయిలో మరమ్మత్తులకు చేరుకుందో పరిశీలించి పంచాయతీ నిధులు సుమారు రూ.60వేలతో మరమ్మత్తులు చేయించి తాగునీటి సరఫరా పునరుద్ధించారు. అంతేగాక పాయకరావుపేట నుండి నామవరం గ్రామానికి వెళ్లే సుమారు 4కిలోమీటర్ల పైపులైను సుమారు రూ.20లక్షలతో కొత్త పైపులైను వేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

వినియోగదారుల అభిరుచి మేరకే లక్కబొమ్మల తయారీ

- వదంతులతో మా హస్తకళను కనుమరుగు కానివ్వొద్దు
- సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులపై కళాకారుల మీడియా సమావేశం

విశాలాంధ్ర - యలమంచిలి: ఏటికొప్పాక లక్క బొమ్మలంటేనే ఓ తిరుగులేని బ్రాండ్ ఉన్న విషయం అందరికీ తెలిసిందే. ఏటికొప్పాక కళాకారుల సృజనాత్మక శక్తికి తిరుగులేదు. ఈ బొమ్మలకు సహజమైన రంగులు వేస్తారు. ఈ రంగులు పూలు, చెట్ల బెరడులు నుండి తయారు చేస్తారు. ఏటికొప్పాక బొమ్మ చేయటమంటే ఓ జీవికి ప్రాణం పోసినంతపని, ఎందుకంటే ప్రతి బొమ్మనీ విడిగా తయారు చేయవలసిందే. మూసపోసి చేయటానికి వీలు లేదు.ఇదే కళపై ఆధారపడి గ్రామంలో 350 కుటుంబాలలో సుమారు 600మంది జీవిస్తున్నారు. ప్రకృతి సహజంగా లభించే రంగులతో చేసిన లక్కబొమ్మలకు ఎక్కువ ఖర్చు అవుతుంది కాబట్టి కొనుగోలు దారుల అభిరుచి మేరకు వారికి కూడా లక్క బొమ్మలను అందుబాటులోకి తేవాలనే ఆలోచనలో కొన్ని రసాయనిక రంగులు ఉపయోగించి కూడా బొమ్మలు తయారు చేసి తక్కువ ధరకు విక్రయిస్తుంటారు.ఈ సందర్భంగా ఏటికొప్పాకలో గురువారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కళాకారులు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన సోషల్ మీడియాలో ఏటికొప్పాక లక్క బొమ్మలను కేవలం రసాయన రంగులతో తయారు చేస్తున్నారంటూ తప్పుడు పోస్టలను పెట్టారని ప్రస్తుత కాలంలో సోషల్ మీడియాలో పెట్టే పోస్టలు అతి త్వరగా ఎక్కువ మందికి చేరుతున్నాయని ముఖ్యంగా ఏటికొప్పాక లక్కబొమ్మల మొత్తం అన్ని కూడా రసాయన రంగులతో తయారు చేస్తున్నారన్న అవాస్తవ విషయం సోషల్ మీడియా ద్వారా ఎక్కువ మందికి చేరితే తమ జీవనోపాధి దెబ్బతినడమే కాక 400 సంవత్సరాల చరిత్ర గల ఏటికొప్పాక లక్క బొమ్మల ప్రాధాన్యత కూడా తగ్గిపోతుందని వాపోయారు. అంతేకాకుండా ఇటువంటి అవాస్తవ వదంతులతో ఏటికొప్పాక హస్తకళలను కనమరుగు చేయద్దన్నారు. అనంతరం కళాకారులంతా కలిసి కాపాడండి.. కాపాడండి...ఏటికొప్పాక లక్క బొమ్మలను కాపాడండి అంటూ నినాదాలు చేశారు. తమ గ్రామ పద్మశ్రీ అవార్డు గ్రహీత సి.వి.రాజుకి వచ్చిన అవార్డును తమకి వచ్చిన అవార్డుగా భావించి గర్వంగా చెప్పుకుంటున్నామని అలాంటి ఆయన మా మీద ఆరోపణలు చేయడం చాలా దురదృష్ట కరమన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత శ్రీశైలపు చిన్నయాచారి, పెదపాటి శరత్,దిమిలి రమణ, నాగేశ్వరరావు, శివకృష్ణ, కన్నాచారి, దిమిలి సత్తిబాబులతో పాటుగా లక్క బొమ్మల విక్రయదారులు అప్పన్న, లోవాచారి, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

దాతలూ...తనను ఆదుకోరూ....

బాధితుడు కొర్ర శ్రీను అభ్యర్ధన

విశాలాంధ్ర - అరకులోయ: పాడేరు మన్యం అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం పెదలబుడు మేజర్ పంచాయితీలో గల అరకులోయ టౌన్ షిప్ పరిధిలోని సి.కాలనీ నివాసి కొర్ర శ్రీను (48) మూడు నెలల క్రితం విశాఖ కేజిహెచ్‌లో క్యాన్సర్ సర్జికల్ ఎమర్జెన్సీ వ్యాధి కారణంగా ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్నాడు. అయితే అన్ని రకాల పరీక్షల అనంతరం వైద్యులు క్యాన్సర్ వ్యాధి ఉందన్న అనుమానంతో స్కానింగ్ చేసి చూడగా నెగటివ్ రిపోర్టు వచ్చిందన్నారు. దీంతో క్షతగాత్రుడు కొర్ర శ్రీను మాట్లాడుతూ కడుపులో పెద్ద కాయ ప్రేగులతో కలిసి ఉందని దాంతో ప్రేగులకు కూడా చిన్నచిన్న కాయలుగా ఏర్పడినట్లు డాక్టర్లు తేల్చి చెప్పినట్టు ఆయన తెలిపారు. అందుకు ముందుగా వంశపార్యం జెనిటిక్ టెస్టు బయట చేయించుకోవాలని సూచించగా 30 వేల రూపాయలు ఖర్చు అవుతుందని ల్యాబ్ వారు చెప్పారని శ్రీను ఆవేదనతో వాపోయాడు. అంతేకాకుండా బ్లడ్ కూడా తెచ్చుకోవాలని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో బ్లడ్ ఎక్కడి నుంచి తెచ్చుకోవాలో అర్థం కావడం లేదని వాపోయాడు. రోజు కూలి పనికి వెళ్తే తప్ప పూట గడవని తన కుటుంబం రక్త పరీక్షలు కూడా చేసుకోలేని పరిస్థితిలో ఉన్నానని బోరున విలపించాడు. రక్త పరీక్షలు చేయించుకోవడానికి దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్న తనను కాపాడాలని ఆయన కోరారు. దాతలు ఈ క్రింది ఫోన్ నెంబర్ 8985310641కు సంప్రదించాలని అభ్యర్థించాడు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: బూడి

విశాలాంధ్ర - వి.మాడుగుల: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం మాడుగుల మండలంలో పొంగలిపాక, శివరామపురం గ్రామాలలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చురుగ్గా పర్యటించి ప్రతీ గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలు, పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తున్నామన్నారు. పొంగలిపాకకు సంబంధించి జల జీవన్ మిషన్ ద్వారా 50 లక్షలు, శివరామపురానికి ఏడు లక్షలు, మొత్తం రెండు గ్రామాలకు సంబంధించి 400 కొళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, వైస్ ఎంపిపిలు తాళపురెడ్డి వెంకట రాజారాం, కొత్తపల్లి శ్రీనివాసరావు, జడ్పిటిసి కిముదు రమణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, మండల సచివాలయం కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వైసిపి గ్రామ శాఖ అధ్యక్షులు నాయన ధన, ఉండూరు బాస్కర్, తహశీల్దార్ పివి.రత్నం, ఎంపిడిఓ మీనాకుమారి, వైసిపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ వార్డ్ సచివాలయ శానిటరీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఆయన సిరిపురంలోని విఎంఆర్డిఏ చిల్డ్రన్స్ ఎరీనా థియేటర్‌లో సీజనల్ వ్యాధులపై ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయ కార్యదర్శులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని జూలై నెల నుండి డిసెంబర్ నెల వరకు ఈ ఆరు నెలలు దోమల వృద్ధికి కీలకమని, ఐ.ఆర్.ఎస్. స్ప్రేయింగ్, ఫాగింగ్, గంబోజి ఫిష్, ఆయిల్ బాల్స్, స్ప్రేయింగ్ ద్వారా దోమలను అరికట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, జివిఎంసి ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావు, జివిఎంసి బయాలజిస్ట్ సాంబమూర్తి, డిస్ట్రిక్ మలేరియా ఆఫీసర్, మలేరియా ఇన్‌స్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం అనకాపల్లి జిల్లా ఇండియన్ పెట్రోల్ బంక్ శ్రీ కన్య థియేటర్ సెంటర్ వద్ద ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం జరిగింది. ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్ ఫెడరేషన్ ఏఐటీయూసీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ రహిమాన్ మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో, మోటార్ రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా ఆన్లైన్ కేసులు తీసుకొచ్చి డ్రైవర్ తప్పు చేస్తున్నారో, ఒప్పు చేస్తున్నారో తెలియని విధంగా పోలీసు వారు ఫోటోలు తీసి ఆటో డ్రైవర్ సెల్ ఫోన్లకు ఈ చలానా మెసేజ్లు పంపిస్తూ కేసులు పెడుతున్నారని ఆటో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 21ను ఆన్లైన్ కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురు బాబు, సిపిఐ పార్టీ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు గుడాల రాంబాబు, విశాఖపట్నం జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.కాసుబాబు, నర్సీపట్నం ఆటో స్టాండ్ నాయకులు రామకృష్ణ, టి.చెన్నయ్య, ఎల్. గణేష్, ఏ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలు జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర - ఆనందపురం: గర్భిణీలు డాక్టర్స్ సలహా నిమిత్తం ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్లు ఏఎన్ఎంలు ప్రోత్సహించాలని డీఎంహెచ్ఓ డా.పి.జగదీశ్వరరావు అన్నారు. పెద్దిపాలెంలో కుటుంబ డాక్టర్ విధానంలో భాగంగా సందర్శించారు. ఫార్మసీ స్టాక్ రిజిస్టర్, పరిశీలించి పలు సూచనలు చేశారు. క్షేత్ర స్థాయి సిబ్బంది సందర్శనకి వెళ్ళినప్పుడు మూవ్మెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డా.ఎన్. రమా రెడ్డి, ప్రోగ్రాం అధికారులు ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుడికి కోరాడ పరామర్శ

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి నియోజకవర్గం పరిధి ఆనందపురం మండలం వేములవలస కాపరస్తులు పట్నాల ప్రసాద్ కుటుంబం తీర్థ యాత్ర నుండి తిరిగి వస్తుండగా నక్కపల్లి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యారు. విషయం తెలిసి వారికి చికిత్స జరుగుతున్న తగరపువలస ఎన్ఆర్ఐ హాస్పిటల్‌కు టీడీపీ ఇన్చార్జి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రాజబాబు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఈయనతోపాటు కోరాడ వేణు, కోరాడ వైకుంఠం నాయకులు ఉన్నారు.

అక్రమ బదిలీలు నిలిపివేయాలి

విశాలాంధ్ర - తగరపువలస: యూటీఎఫ్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు విశాఖ జిల్లా డీఈఓ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షతన నిరసన చేపట్టారు. తక్షణమే అక్రమ బదిలీలు నిలిపివేయాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులకు, జీవీఎంసీ భీమిలీ పరిధిలో 14 మంది ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎస్. నాగమణి, పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శిలు తదాన అప్పారావు, వై.అర్.కే.ప్రసాద్, జిల్లా గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, సహాధ్యక్షులు రొంగలి ఉమాదేవి, కోశాధికారి కే.రాంబాబు, కార్యదర్శులు సామ రాజులు, చుక్క సత్యం, ఉప్పాడ రాము, రియాజ్ అహ్మద్, టి.జగన్, ఉషారాణి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు రూ.2400 చెల్లించాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: కాంట్రాక్టు కార్మికులకు రూ.2400 వెంటనే చెల్లించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాలు ఉక్కు యాజమాన్యాన్ని హెచ్చరించాయి. సమస్య పరిష్కారం కోసం ఇడి వర్క్స్ కార్యాలయం వేలాదిమంది కార్మికుల నినాదాలతో దద్దరిల్లింది. ఉక్కు యాజమాన్యం నోటీస్ పే, బోనస్ తీసివేసి కార్మికులకు తీరని ద్రోహం చేసిందని నిలిపి వేసిన 2400ను వారం రోజుల్లో పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని అన్నారు. జీఎం హెచ్‌ఆర్ బినయ్ ప్రసాద్‌కు కార్మికుల సమక్షంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, మంత్రి రవి, నందికి తాతారావు, అవతారం, వంశీ, సత్యారావు, కోన రమణ, బొడ్డు పైడిరాజు, ఉమ్మడి అప్పారావు, గురునాథ్, కె.సత్యవతి పాల్గొన్నారు.

పరిశోధనలే విజ్ఞానానికి మూలం

విశాలాంధ్ర - మల్కాపురం: పరిశోధనలే విజ్ఞానానికి మూలం అని, పరిశోధనల వల్ల అనేక సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని మైక్రో బయాలజీ అధ్యాపకురాలు డాక్టర్ సిహెచ్.ప్రశాంతి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో నూతనంగా డిగ్రీలో చేరిన విద్యార్థినులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఉన్నత విద్య బోధన పరిశోధనలపై ఆధారపడి ఉందని అన్నారు. అనంతరం 'సృజనాత్మక ఆలోచన' అనే అంశంపై రసాయన శాస్త్ర అధ్యాపకురాలు, జాతీయ సేవా పథక ప్రోగ్రాం అధికారి వి.అంజలీదేవి వివరించారు. సెయింట్ ఆన్స్ కళాశాలలోని ప్రయోగశాలల్లో జరిగిన కొన్ని ఆధునిక పరిశోధనలను సీనియర్ విద్యార్థులు జూనియర్లకు వివరించారు. వీరందరినీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అభినందించారు.

విశాలాంధ్ర
➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

సింహాద్రప్పన్నకు ఏకాంత సేవలేనా.....!

బహిరంగంగా ఉత్సవాలు, సేవలు చేస్తే మేలు

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం సింహగిరిపై కొలువై ఉన్న ఉత్తరాంధ్ర, దేశ , విదేశీయుల ఆరాధ్య శ్రీ వరాహాలక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో వార, పక్ష, మాసోత్సవాలు ఏకాంతంగా కాకుండా బహిరంగంగా జరిపిస్తే దేవాలయానికి భక్తులతోపాటు ఆదాయం కుడా మరింత పెరిగే అవకాశం ఉంటుందని భక్తులు, స్థానికులు అంటున్నారు. వారోత్సవాలు ప్రతి గురువారం ప్రధాన విరాట్టమూర్ల్లు సింహావల్లి తాయారు అమ్మవార్లకు అభిషేకం జరుగుతుంది. శుక్రవారం ఆండాళ్ (గోదాదేవి) అమ్మవార్లకు చక్కెరపొంగలి, బూరెలు, దద్దోజనం ప్రసాదాల నైవేద్యంతో అభిషేకం జరుగుతుంది. ప్రస్తుతం పై రెండు ఉత్సవాలు ఆరాధన సమయంలో ఏకాంతంగా జరుగుతున్నాయి. పక్షోత్సవం (బహుళ, శుద్ధ) ఏకాదశినాడు (శయనమందిరంలో) మండపంలో కొలువైఉన్న మదనగోపాలస్వామి వారికి అప్పాలు, శీర నైవేద్యంతో అభిషేకం జరుగుతుంది. మాసోత్సవం ప్రతి నెల పౌర్ణమి నాడు ఉత్సవమూర్తులకు అష్టోత్తర శత కలశాభిషేకం, సాయంత్రం గ్రామ గరుడసేవ (తిరువీధి) నాలుగు హారాలు (పులిహెూర, దద్దోజనం, పొంగలి, చక్కెరపొంగలి) నైవేద్యంతో జరుగుతున్నాయి. వార, పక్ష, మాసోత్సవాలు ఉదయం గం.7 నుండి 9 వరకు బేడామండపం హంసమూల ఆర్జితం, అభిషేకం పేరుతో భక్తులకు, దాతలకు కనీస ప్రవేశ రుసుముతో బహిరంగంగా ఉత్సవాలు జరిపితే దేవస్థానం పేరు మరింత అభివృద్ధి చెందుతుందని అదేవిదంగా ఆర్జితం, అభిషేకం సేవల్లో పాల్గొన్న ఆయా భక్తులకు ఒక లడ్డు, స్వామివారి నైవేద్యం ప్రసాదంగా ఇస్తే వారు ఎంతో సంతోషిస్తారని భక్తులు, స్థానికులు అంటున్నారు. అయితే దీనిపై కొందరు వైదిక పెద్దలను వివరణ కోరగా మా పెరుమాళ్ళకు, దేవస్థానంకు పేరువస్తే మాకు మంచిదే అన్నారు. కాని స్వామివారి దూపదీప, నైవేద్యాలకు మొత్తం 30 మంది సిబ్బంది అవసరం ఉంటుంది. ప్రస్తుతం దూపదీప, నైవేద్యాలకు ఉన్న సిబ్బంది 24 మందిలో 4గురు సీతారామ స్వామివారి ఆలయం, వేంకటేశ్వరస్వామీ ఆలయం, మాధవస్వామి ఆలయం మొదలగు దేవాలయాలకు పంపించటం జరిగింది. ఉన్న సిబ్బంది తక్కువాయె, వీరిలో అడపా దడపా సెలవులు పెట్టటం జరుగుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు దేవాదాయ ధర్మాదాయశాఖ అనేక మంత్రులతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులైన ప్రధాన కార్యదర్శులకు, కమిషనర్లకు విన్నపాలు చేయటం జరుగుతోంది కాని ఆచరణ శూన్యం అని మనోవేదన చెందుతున్నారు . దీనిపై కార్యనిర్వాహణాధికారి వారు సరైన నిర్ణయం తీసుకుని ప్రధాన అధికారులకు సమస్యను వివరించి స్వామివారికి మేలు చేస్తే బాగుంతోందని వైదిక పెద్దలు, భక్తులు , స్థానికులు కోరుకుంటున్నారు.

వర్షానికి కారుతున్న మోతుగూడెం పీహెచ్‌సీ

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చిన్నపాటి వర్షానికే లీకేజీ అయి తడిసి ముద్దయింది. దీంతో ఆసుపత్రికి వచ్చినటువంటి రోగులను చూడటానికి డాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీలో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం విఫల మవుతుందని చెప్పుకోవచ్చు. దీనికి నిదర్శనం మోతుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే. ఈ భవనము వర్షం వస్తే గదులన్నీ తడిచి ముద్ద అవుతున్నాయి. దీంతో లక్షలు వెచ్చించి తీసుకున్న పరికరాలన్నీ వర్షం పడటంతో తడిసి పాడవుతున్నాయి. వీటిని కాపాడేందుకు సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కొత్త భవనం నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ డిఎంహెచ్వో పుల్లయ్యని వివరణ కోరగా గత వారం రోజుల క్రితం భవనాన్ని పరిశీలించామని, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు.

సీఐకి శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్లు

విశాలాంధ్ర - మల్కాపురం: మల్కాపురం పోలీస్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన జీడీ బాబుకు గురువారం 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు తదితరులు సీఐ జీడీ బాబుకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గత సీఐ లూథర్ బాబు, గంటా వర్మ, పెంట్ల బాలకృష్ణ, సురేష్, సూర్యనారాయణ, గంటా జగన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైన వైద్యాధికారిపై ఫిర్యాదు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం లాగరాయి పీహెచ్‌సీకి చెందిన వైద్యాధికారి వైవిబిఎస్‌జి రవింద్ర మూడు రోజులుగా విధులకు హాజరు కాలేదని గిరిజన సంఘం జెఏసి నాయకులు ఎంపిడివో యాదగిరేశ్వరావుకి ఫిర్యాదు చేశారు. జెఏసి నాయకుడు వంతు బాల కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల లాగరాయి పీహెచ్‌సీని 24 గంటలు పనిచేసేలా మార్పు చేసారని, ఇద్దరు వైద్యాధికారులను నియమించారని తెలిపారు. వీరిలో ఒకరు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తుండగా మరొకరు విధులకు రావడం లేదని, దీంతో రోగులు పలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈయన వెంట ఈక శ్రీను, వజ్రపు అప్పారరావు ఉన్నారు.

విస్సాపురంలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - ఎటపాక: ఎటపాక మండలం విస్సాపురం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ పోడియం జ్యోతి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సేవలలో 11 రకాల సేవలకు సంబంధించి సుమారు 303 ధృవీకరణ పత్రాలు తహశీల్దార్ వేణుగోపాల్, వై.సి.పి జిల్లా నాయకులు కురినాల వెంకటేశ్వర్లు (బుజ్జి), సచివాలయం కన్వీనర్‌లు పోడియం లక్ష్మణ్, ఇర్ప మంగేశ్వరరావు, కుంజ పార్వతి, బాలరాజు చేతుల మీదుగా దరఖాస్తుదారులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు గొల్లపల్లి శివబాబు వై.కా.పా నాయకులు, శీలం. నాగేశ్వరావు, ఆర్.ఐ భూపతి రాజు పాల్గొన్నారు.

ఎంపీ మాధవిని కలిసిన సర్పంచ్ పూర్ణిమ

విశాలాంధ్ర - హుకుంపేట: హుకుంపేట పంచాయతీకి నిధులు కేటాయించాలని కోరుతూ ఎంపీ గొడ్డేటి మాధవిని కలిసి విన్నవించామని స్థానిక సర్పంచ్ సమీడా వెంకట పూర్ణిమ తెలిపారు. గురువారం విశాఖపట్నంలో ఎంపీ నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి హుకుంపేట పంచాయతీ అభివృద్ధికి ఎంపీ నిధుల నుండి నిధులు కేటాయించాలని కోరినట్టు తెలిపారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ బస్ షెల్టర్ ఏర్పాటుకు నిధులు కేటాయిస్తామని, అలాగే సిసి రోడ్లకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - చింతపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని వైద్యాధికారులు రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ భాషా అన్నారు. మండలంలోని లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన సిబ్బంది యొక్క మూమెంట్ రిజిస్టర్‌తో పాటు రోగుల ఓపి పుస్తకాన్ని తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారిణి జానకిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోనే సుఖప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మందుల కొరత లేకుండా చూసుకునే బాధ్యత వైద్యాధికారులపై ఉందన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నివేదికలు (రిపోర్ట్స్) సకాలంలో యాప్ లలో అప్లోడ్ చేయవలసిన బాధ్యత ఆరోగ్యశాఖ సిబ్బందిపై ఉందన్నారు. అదేవిధంగా వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి వసతి సదుపాయం కల్పించేందుకు సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆ సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి సింహాద్రి, టీబీ సూపర్వైజర్ ప్రసాద్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వాడలో విత్తనశుద్ధి

విశాలాంధ్ర - తగరపువలస: మండలంలో కొత్త కొవ్వాడ గ్రామంలో సామూహికంగా బీజామృతం తో విత్తనశుద్ధి చేయటం జరిగింది. రీజనల్ అధికారి హేమసుందర్ రైతులకు బీజామృతంతో విత్తనశుద్ధి ఏ విధంగా చేయాలో వివరించారు. విత్తనశుద్ధి చేయటం వలన విత్తనాలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, విత్తనం నాటిననుండి 45 రోజుల వరకు తెగుళ్ళనుండి కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో కొవ్వాడ గ్రామ సర్పంచ్ పొన్నకాయల రత్నం, నేచురల్ ఫామింగ్ అసోసియేట్‌లు ఎస్.బాలామని, శ్రీనివాస్ చక్రవర్తి, అనూష, కోటలక్ష్మి, సూర్యకోటలక్ష్మి, మహేశ్వరి, అరుణ పాల్గొన్నారు.

ఆర్థిక సంక్షోభంలో గిరిజనులు

కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షురాలు రాధాలక్ష్మి

విశాలాంధ్ర - హుకుంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వలన నిరుద్యోగ శాతం పెరిగి సాధారణ ప్రజల మనుగడ కష్టతరంగా మారి ఆర్థిక సంక్షోభంలో గిరిజనులు చిక్కు కున్నారని హుకుంపేట మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు శ్రీధర్ రాధా లక్ష్మి తెలిపారు. గురువారం మండలంలోని తీగల వలస పంచాయతీ పంతల చింత గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముద్రించిన కరపత్రాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఆదివాసి కాంగ్రెస్ చైర్పర్సన్ పాచిపెంట సంతకుమారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వలన నిత్యవసర సరుకులు ధరలు భారీగా పెరిగిపో యింది నిరుద్యోగం బాగా పెరిగిందని, ఆర్థిక సంక్షోభంలో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి పార్టీ, వైసిపి పార్టీ విధానాలు వలన రాష్ట్రంలో గిరిజనులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సీదరి లింగన్న. కాంగ్రెస్ పార్టీ నాయకులు మత్రి చిట్టిబాబు, పాంగి జగ్గారావు, సిదారి మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వెలమల పేరుతో ఎమ్మెల్యే అవంతిని విమర్శిస్తే సహించం

విశాలాంధ్ర - పద్మనాభం: వెలమ సంఘం కులస్తుల పేరుతో భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావుని విమర్శిస్తే తగిన బుద్ధి చెప్తామని పద్మనాభం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెలమ ప్రతినిధులు హెచ్చరించారు. అనంతవరం గ్రామంలో సమావేశంలో వైయస్సార్ పార్టీ వెలమ ప్రతినిధులు మాట్లాడారు. నేటి వరకు పద్మనాభ మండలం వెలమ కులానికి ఇటువంటి సంఘము ఏర్పాటు కాలేదని, ఇటీవల వైయస్సార్ పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఇతర కులానికి చెందిన దంతులూరి గోపాల కృష్ణమూర్తి రాజు వెలమ కులానికి చెందిన కొంతమంది యువకులను తప్పు దోవ పట్టించి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావుపై విమర్శలు చేస్తున్నాడని వారు ఆరోపించారు. గత రెండు రోజుల క్రితం వెలమలము అంటూ ఎమ్మెల్యే అవంతిపై విమర్శలు చేసిన వ్యక్తులు ఎమ్మెల్యే వద్ద ఎన్నో పనులు చేసుకున్నారని, అవన్నీ మరచి, గోపిరాజు మైకములో పడి పేలుతున్నారని గొర్రెపాటి పెద ఎర్నాయుడు కసిరెడ్డి ప్రభాకర్‌రావులు తెలిపారు. గోపి రాజు గతంలో విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటికాపల్లి రెవెన్యూ పరిధిలో కొంతమంది భూములను కబ్జా చేస్తే పోలీసులు కేసు నమోదు చేశారని, అలాగే పద్మనాభం మండలం అనంతవరం పంచాయతీలో ఒక దళితుని భూమి లోకి చొరబడి అన్యాయంగా జీడి మొక్కలు మొక్కలు నరికితే పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. ఇలాంటి తప్పులు చేస్తున్న గోపిరాజుతో కలిసి కొంతమంది వెలమలు ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావుని విమర్శిస్తున్నారని అన్నారు. సమావేశంలో గొర్రెపాటి ఎర్రి బాబు, కసిరెడ్డి ప్రభాకర్ రావు, గొర్లె బంగారు నాయుడు, కరిమిరెడ్డి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముత్యమాంబ అమ్మవారి పండగ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పెదగంట్యాడ సీతానగరం గ్రామంలో శ్రీ ముత్యమాంబ అమ్మవారి పండగ అనువు ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 75వ వార్డ్ కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, టిడిపి నాయకులు పులి రమణారెడ్డి, గ్రామ అధ్యక్షులు నక్క దురుగు బాబు, హరి సీమ, శ్రీ శ్రీనివాస్, కనితి అప్పలరాజు, నమ్మి అప్పారావు, వంశి పైడ్రాజు, నంబర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గిరి రైతులకు మొక్కలు పంపిణీ

విశాలాంధ్ర - జీకే వీధి: మండలంలోని రింతాడ పంచాయతీ ఏబులం నేలపాడు గ్రామంలో గిరిజన రైతులకు ఉపాధి హామీ పథకంలో బాగంగా సపోటా, నిమ్మ, జామ మొక్కలు పంపిణీ చేశారు. రింతాడ సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి చేతులు మీదుగా మొక్కలు పంపిణీ చేశారు. ఒక్కొక్క రైతుకు ఎకరానికి 60 మొక్కలు చొప్పున మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు, మధుసూదన్ రావు, టెక్నికల్ అసిస్టెంట్లు శివ, రామూర్తి, వీఆర్పీ నూకరత్నం, త్రిమూర్తులు, సాంబశివ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో బాధ్యతలు స్వీకరించిన ఇద్దరు వైద్యాధికారిణిలు

పెథాలజిస్టుగా శాంతి ప్రియ, ఈఎన్‌టీగా చందన శ్రీ

విశాలాంధ్ర - చింతపల్లి: స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వైద్యాధికారిణిలు శాంతి ప్రియ, చందన శ్రీ అన్నారు. బదిలీపై వచ్చిన వారు స్థానిక ఆసుపత్రిలో గురువారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. పెథాలజిస్టుగా గోపసిన శాంతి ప్రియ, ఈఎన్‌టీగా (చెవి, ముక్కు, గొంతు) లాలం చందన శ్రీలు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన (ఈఎన్‌టి) నిపుణుడైన వైద్యాధికారి రుత్తల వర ప్రసన్న బదిలీపై నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి వెళ్లడంతో ఆయన స్థానంలో చందన శ్రీ నియమితులయ్యారు. ఆమె గురువారం బాధ్యతలు చేపట్టారు. అదే క్రమంలో పెథాలజిస్టుగా శాంతి ప్రియ నియమితులు కావడంతో ఆమె కూడా గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాల పునర్విభజన తరువాత పాడేరు కేంద్రంగా అల్లూరి జిల్లా ఏర్పడడంతో చింతపల్లి సామాజిక ఆసుపత్రి ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చింతపల్లి 30 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా పెంచడంతో నిపుణులైన వైద్యుల అవసరం ఏర్పడింది. చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాలతో పాటు ఆ మండలాలను అనుకొని ఉన్న అనేక గిరి గ్రామాలకు పెద్ద దిక్కైన చింతపల్లి ఆసుపత్రిలో నిపుణులైన వైద్యుల అవసరాన్ని గుర్తించిన సంబంధిత ఉన్నతాధికారులు నిపుణులైన వైద్యాధికారులను నియమిస్తూ చింతపల్లి ఆసుపత్రికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా కృషి చేస్తున్నారు ఇందులో భాగంగానే ఇప్పటికే గైనకాలజిస్ట్, ఎనస్తీసియా తదితర వైద్య నిపుణులను నియమించిన విషయం తెలిసిందే. అదే క్రమంలో నేడు పెథాలజిస్ట్, ఈఎన్‌టి వైద్యాధికారిణిలను నియమించడంతో గురువారం వారు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వార్డుల్లో ప్లానింగ్ కార్యదర్శులు అంకితభావంతో పనిచేయాలి

డీసీపీ నరేంద్ర నాథ్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలో టౌన్ ప్లానింగ్ కార్యకలాపాల నిర్వహణలో వార్డు ప్లానింగ్ కార్యదర్శి అంకితభావంతో పనిచేయాలని డీసీపీ నరేంద్ర నాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం జోన్ 3 కార్యాలయంలో వార్డు సచివాలయం ప్లానింగ్ కార్యదర్శిలకు అవగాహన కార్యక్రమం, ఎసిపి సభనం శాస్త్రి ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. వార్డులో అనధికార నిర్మాణాల నిర్మూలనకు అనునిత్యం క్షేత్రస్థాయిలో ప్లానింగ్ సెక్రటరీలు పనిచేయాలన్నారు. రోడ్లపై ఆక్రమణలు అరికట్టాలని, పోస్టర్ల నిర్మూలన జరగాలని, రోడ్ల విస్తరణ కార్యక్రమంలో ప్లానింగ్ కార్యదర్శులు ప్రధాన భూమిక పోషించాలన్నారు. కమిషనర్ ఆదేశాలను ప్లానింగ్ కార్యదర్శులు తప్పక పాటించాలని, అవినీతి రహిత పాలన ప్రజలకు అందించేందుకు నిర్మాణ దారులకు సేవలు అందించాలని ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారులు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులకు తెలియజేశారు. ఈ సమావేశంలో టీపీఏ తేజ, డీపీఓ అనిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై బొత్స కక్ష సాధింపు: బుద్ధ నాగ జగదీష్



విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని కేటగిరీలకు చెందిన 3200 మంది ఉపాధ్యాయులు ఉన్నారని, దీనిలో 2200 మంది బదిలీలకి దరఖాస్తు చేసుకున్నారని 1800 మందికి బదిలీలు జరిగాయని మిగతా వారందరూ కూడా నిరాశ నిస్పృహలకు గురయ్యారని, ప్రభుత్వ సిఫార్సు పేరుతో చేస్తున్న ఉపాధ్యాయ అక్రమ బదిలీలు తక్షణమే నిలుపుదల చేయాలని అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలకు సుమారు 80 వేల మంది దరఖాస్తు చేసుకుంటే 52 వేల మందికి బదిలీలు జరిగాయని, కేటాయించిన స్థలంలో పోస్టులు ఖాళీ లేకపోవడం సాంకేతిక కారణాల వంటి ప్రభుత్వ వైఫల్యాలు వల్ల ఎప్పటికీ చాలామంది ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇవ్వలేదని నాగ జగదీష్ ఆవేదన వ్యక్తపరిచారు. మంత్రి బొత్స సత్యనారాయణ బదిలీలకు ముందు 200 మంది ఉపాధ్యాయులకు ప్రభుత్వ సిఫార్సులతో బదిలీలు చేశారని ఇప్పుడు సాధారణ బదిలీలు ముగిశాక మరో 500 మందికి బదిలీలు చేసినట్లుగా తెలుస్తుందని, ప్రభుత్వ సిఫార్సులతో బదిలీలు చేపట్టడం వల్ల మొత్తం బదిలీలు ప్రక్రియ అవహాస్యానికి గురైందని బదిలీల్లో అన్యాయం జరిగిన వారికి ప్లేసులు కేటాయింపులు విపరీత జాప్యం చేస్తున్న డీఈవోలు సిఫార్సుల బదిలీలకు మాత్రం వెంటనే పోస్టింగ్ ఇస్తున్నారని తక్కిన వారి విషయంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగ విరమణ కు సిద్ధంగా ఉన్న 200 మంది మహిళా పురుష ఉపాధ్యాయులు ఏజెన్సీ ప్రాంతాలకు పోస్టింగ్లు ఇవ్వడం ఇది ముమ్మాటికీ విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటున్నారని ఉద్యోగం ఉపాధ్యాయ వర్గాలు ఎలాగా వైసీపీకి ఓట్లు వేయరు కాబట్టి వీళ్ళని వేధించిన పర్వాలేదని పత్రిక విలేకరుల సమావేశంలో బహిరంగంగా మాట్లాడారని, వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విజయవాడలో నిర్వహించిన ఊరేగింపును దృష్టిలో పెట్టుకొని కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నారని అన్నారు. అనకాపల్లి జిల్లాలో ఏకో ఉపాధ్యాయ పాఠశాలల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని దీంతో ఉపాధ్యాయులపై ఒత్తిడి ఎక్కువ ఉందని సింగిల్ టీచర్స్ స్కూల్లలో ఉపాధ్యాయులు అత్యవసరంగా సెలవు పెడితే ఆ పాఠశాల మూసివేతే అవుతుందని కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ప్రతి పాఠశాలకు ఉండాలని నిబంధనను ప్రస్తుత ప్రభుత్వం తుంగలో తొక్కుతుందని అన్నారు. విలేకరుల సమావేశంలో బొడి వెంకటరావు, కుప్పిలి జగన్, మల్ల గణేష్ ,గుడాల సత్యనారాయణ, మల్ల శివన్నారాయణ, బర్నికాన శ్రీనివాసరావు, పూడి త్రినాధ, బుద్ధ భువనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంపెనీకి భూములిచ్చి పస్తులుంటున్న నిర్వాసితులు

విశాలాంధ్ర - పెందుర్తి: కంపెనీ వస్తే బతుకులు బాగుపడతాయని భావించి కారుచౌకగా భూములిచ్చిన నిర్వాసితులు ఇప్పుడు పస్తులుంటున్నారు. కంపెనీలో సెక్యూరిటి గార్డులుగా, కళాసీలుగా పనిచేసిన కార్మికులు యాజమాన్యం నిర్లక్ష్యంతో ఆకలితో అలమటిస్తున్నారు. విశాఖ జిల్లా, వేపగుంట సమీపంలోని రైతులు 1982లో ఆంధ్రా సిమెంట్ కంపెనీ ఏర్పాటు కోసం కారుచౌకగా భూములిచ్చారు. అయితే యాజమాన్యం తాత్కాలిక ఉద్యోగులు మాత్రమే ఇచ్చి చేతులు దులిపేసుకుంది. అందులో దాదాపు 30 ఏళ్ల పాటు పనిచేసిన తాత్కలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా వదిలేసింది. ఆ తర్వాత ఆంధ్రా సిమెంట్ యాజమాన్యం 2010లో జేపి సిమెంట్స్ కు విక్రయించడంతో కొత్త యాజమాన్యం టెంపరరీ ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా తొలగించింది. వారికి చెల్లించాల్సిన గ్రాట్యుటీ సహా ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వకుండా బయటకు పంపిచేయడంతో కార్మికులు ఆంధోళన చేస్తూనే ఉన్నారు. రాజకీయ నాయకులు, అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. కోర్టులో కేసు నడుస్తుండగానే ఇటీవల జెపి సిమెంట్స్ యాజమాన్యం సాగర్ సిమెంట్స్ కు ఆ సంస్థను విక్రయించింది. ఈ నేపద్యంలో భూనిర్వాసితులు, ఉద్యోగులు కంపెనీ గేటు ముందు ఆంధోళన చేపట్టి న్యాయం చేయాలని కోరుతున్నారు.

లచ్చన్నపాలెం వార్డు మెంబర్ రాజీనామా

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాకవరపాలెం మండలం లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన నాల్గో వార్డు మెంబర్ రాళ్లపల్లి స్వాతి తన రాజీనామా పత్రాన్ని బుధవారం ఎంపీడీఓ అరుణశ్రీకి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వైసిపి నాయకుల తీరు నచ్చకే రాజీనామా చేస్తున్నానని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో ప్రజల్లో రోజురోజుకి వ్యతిరేకత పెరుగుతుందని, అందుకే రాజీనామా చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

పాఠశాలలో గ్యాస్ బండ నుంచి మంటలు

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాకవరపాలెం మండలం గిడుతూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందించేందుకు గురువారం సిద్ధం చేస్తుండగా గ్యాస్ పైపులో నుంచి మంటలు చెలరేగాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, భోజన నిర్వాహకులు ఆందోళన చెందారు. వెంటనే అగ్నిమాపక వాహనానికి సమాచారం ఇవ్వడంతో వాహనం వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

శాకాంబరి అవతారంలో మరిడిమాంబ

విశాలాంధ్ర - వి.మాడుగుల: ఆషాడ బహుళ ఏకాదశి పురస్కరించుకొని మాడుగుల శ్రీమరిడిమాంబ అమ్మవారు గురువారం శాకంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలు పళ్ళు ఆకుకూరలతో అమ్మవారిని అందంగా అలంకరించారు. ఆషాడ మాసంలో అమ్మవారిని శాకంబరీ దేవిగా దర్శించుకుంటే అన్ని సత్ఫలితాలు చేకూరుతాయని ప్రజల భావిస్తారు. ప్రజలంతా అమ్మవారిని దర్శించుకున్నారు.

పెదలువ్వాసింగిలో మొక్కలు పంపిణీ

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలం పెద లువ్వాసింగి సచివాలయ పరిధిలో 80 మంది రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద వివిధ రకాల మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ సిహెచ్.చంద్రశేఖరరావు తెలిపారు. గురువారం పెద లువ్వాసింగిలో జగనన్న సురక్ష సమావేశంలో ఎంపీడీఓ, మండల ప్రత్యేక అధికారి, డీపీఆర్ఓ గోవిందరాజులుతో కలసి కడయం నుండి తెప్పించిన మొక్కలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఇజిఎస్ సాంకేతిక సహాయకులు వరప్రసాద్, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రీడలపై యువత ఆసక్తిని పెంపొందించాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: నేటి యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుంటూనే మరోవైపు క్రీడలపై ఆసక్తిని చూపాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు అన్నారు. క్రీడాభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో తోడ్పాటునందిస్తున్నాయని చెప్పారు. వార్డులోని భానోజీతోటలో ఏజె వారియర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కబడ్డీ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రికెట్ తర్వాత అత్యంత ప్రాచుర్యం పొందింది కబడ్డీయేనన్నారు. కార్యక్రమంలో కబడ్డీ సంఘం ప్రతినిధి ప్రసాద్ రెడ్డి, కోచ్‌లు జయ, అంజనీ, సభ్యులు లక్ష్మణరావు, భూలోక, అప్పలరాజు, కుమార్ వర్మ,వార్డు అధ్యక్షుడు లోకనాథం, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీనివాస్,ఇరోతి గణేష్, దేముడు తదితరులు పాల్గొన్నారు.

పవన్ అనుచిత వ్యాఖ్యలపై నిరసన

విశాలాంధ్ర - పెదబయలు: అల్లూరి జిల్లా పెదబయలు మండల కేంద్రంలో గురువారం పలు గ్రామాల వాలంటీర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. వాలంటీర్ల మండల అధ్యక్షులు కరుణాకర్ మాట్లాడుతూ గ్రామ సేవకులుగా నియమితులై అనేక బాధ్యతలు వ్యవహరిస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ తమకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం పవన్ కళ్యాణ్‌పై కేసు నమోదు చేయాలని స్థానిక ఎస్సైకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామ వలంటీర్లు మనోహర్ ప్రసాద్, కృష్ణారావు, ఆనంద్, సుప్రియ, వీణ భారతి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంత ప్రజల ఆసుపత్రి కల సాకారం

అందుబాటులోకి వచ్చిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

విశాలాంధ్ర - చింతపల్లి: ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతమైన మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ప్రజల ఆసుపత్రి కల సాకారం అయింది. కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎట్టకేలకు పూర్తి అయింది. గురువారం వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలు, పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్, ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, చింతపల్లి, జీకే వీధి ఎంపీపీలు కోరాబు అనూష దేవి, బోయిన కుమారి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్యలతో కలిసి ఆసుపత్రిని లాంచనంగా ప్రారం భించారు. ఆ పంచాయతీ సర్పంచ్ కొర్ర రమేష్ నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు మచ్చుమ్మ ల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే గాక ఇప్పటికే ఆసుపత్రికి అవసరమైన సకల సదుపాయాలు కల్పించారు. ఈ క్రమంలో వారు మాట్లాడుతూ తరతరాలుగా మావోయిస్టు ప్రాబల్య ప్రాంతంగా ముద్ర పడటంతో అభివృద్ధికి ఆమడ దూరాన ఉన్న బలపం పంచాయితీలో నేడు ఆసుపత్రి అందుబాటులోకి రావడం వైకాపా ప్రభుత్వ పనితనానికి నిదర్శనం అన్నారు. ఎంత మారుమూలనున్న ప్రజలైనప్పటికీ వైకాపా ప్రభుత్వంలో సకల సదుపాయాలు పొందాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచన మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో బలపం పంచాయితీలో అభివృద్ధిని వేగవంతం చేయాలని సంకల్పించడం జరిగిందన్నారు ఇందులో భాగంగానే బలపం పంచాయతీలో రహదారుల నిర్మాణానికి నాలుగు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని అదే క్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే వైద్యాధికారికి నివాస గృహం (క్వార్టర్) నిర్మాణానికి నిధులు మంజూరు చేయడమే గాక, ఆరునెలల వ్యవధిలోనే ఆ నిర్మాణాన్ని పూర్తి చేయించడం జరుగుతుందని పాడేరు ఐటిడిఏ పిఓ అభిషేక్ తెలిపారు. ఇటువంటి సదుపాయాల కల్పనతో బలపం పంచాయతీ ప్రజలకే గాక ఆ పంచాయతీని ఆనుకొని ఉన్న ఇతర పంచాయతీలు, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కొన్ని గ్రామాల గిరిజనులకు కూడా ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉంటుందని రహదారుల నిర్మాణం పూర్తయితే అంబులెన్స్‌లు కూడా గిరి గ్రామాలకు వెళ్లేందుకు వెసులుబాటు కలుగుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటువంటి సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పిఓ అభిషేక్‌తోపాటు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు.

జీవో నెం.301, 388 భూములకు కన్వేయన్స్ డీడ్ అమలు

- జాయింట్ కలెక్టర్ కే.ఎస్.విశ్వనాథన్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవోనెం. 301, 388 ద్వారా క్రమబద్ధీకరణ పట్టాలను పొందిన భూములకు కన్వేయన్స్ డీడ్ ప్రక్రియ ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ కే.ఎస్.విశ్వనాథన్ తెలియజేసారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జీవో నెం.301, 388 ద్వారా అర్హులైన లబ్ధిదారులకు కన్వేయన్స్ డీడ్ ప్రక్రియపై పత్రికా విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో బీపీఎల్, ఏపిఎల్ కుటుంబాలకు నివాస గృహాల ద్వారా ప్రభుత్వ భూములలో అభ్యంతరం లేని ఆక్రమణలను క్రమబద్ధీకరించడానికి, అర్హులైన లబ్ధిదారులకు ఉచితంగా, మార్కెట్ విలువ చెల్లింపుపై క్రమబద్ధీకరణ పట్టాలను గతంలో జారీ చేయుట జరిగింది. 8401 దరఖాస్తుల్లో 5890 కేసులకు క్రమబద్ధీకరణ మొత్తం పూర్తిగా చెల్లించబడిందని తెలిపారు. 5890 కన్వేయన్స్ డీడ్‌లలో 3435 కేసులు 100 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్నాయని, వీటికి లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కేవలం వినియోగదారు రుసుము రూ. 500 చెల్లుంచాలన్నారు. 100 చదరపు గజాల పైన వున్న 2455 లబ్ధిదారులు గతంలో చెల్లించిన క్రమబద్ధీకరణ ఖర్చుపై 7.5% రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించాలని చెప్పారు. తేది 14-07-2023 నుండి టైమ్‌లైన్ షెడ్యూల్ ప్రకారం వార్డులలో లబ్ధిదారులకు అనుకూలంగా కన్వేయన్స్ డీడ్ అమలు చేయబడుతుందని వివరించారు. అదేవిధంగా జీవో నెంబర్ 301 ద్వారా 7441 దరఖాస్తులు అందాయని వీటిలో 7228 మంది కేసులకు పూర్తిగా క్రమబద్ధీకరణ మొత్తం చెల్లించినట్లు పేర్కొన్నారు. వీరందరికీ తేది.14.07.2023 నుండి టైమ్‌లైన్ షెడ్యూల్ ప్రకారం కన్వేయన్స్ డీడ్ అమలు చేయబడుతుందని వివరించారు. సంబంధిత మండల తహశీల్దార్లు కన్వేయన్స్ డీడ్‌లను అమలు చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎస్ . శ్రీనివాస్ మూర్తి , ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రామారావు తదతరులు పాల్గొన్నారు.

ఎడతెరపి లేని వర్షం

విశాలాంధ్ర - దేవీపట్నం: రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రైతుల కళ్ళల్లో ఆనందం వ్యక్తమౌతోంది. విత్తనాలు వేసి సాగుకు సమాయత్తం అవుతున్న తరుణంలో వానలు కురిసి చెరువులు నిండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఇందుకూరుపేట పోతురెడ్డి వారి చెరువు శరభవరంలో అరవాలమ్మ చెరువు దేవారంలో జానకమ్మ చెరువు ఇందుకూరు చెరువు నిండుకుండలను తలపిస్తున్నాయి. ఇప్పటికే రైతులు విత్తనాలు వేసి వరి నారు కోసం ఎదురు చూస్తున్నారు. వర్షం కారణంగా ఉదయం ఇందుకూరుపేట రావిలంక గ్రామాల మధ్య వాగు పొంగటంతో జనం రాకపోకలు లేక అవస్థలు పడ్డారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థినీలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని గుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకున్న ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామారావు తెలిపారు. పాఠశాలలో చదివిన గట్టెం శ్రీరమ్య 588 మార్కులు, యండగుండి దివ్య 576 మార్కులు, పిల్లి వీరమణి 573 మార్కులు సాధించారు. వీరు ముగ్గురు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు జి.రామారావుతోపాటు ఉపాధ్యాయులు ఎస్‌కె నాగూర్, ఎస్‌కె రహీమ్, రామ్‌గోపాల్, నానాజి, యోహాన్, రవి తదితరులు ఘనంగా అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి మండల విద్యార్థులు

విశాలాంధ్ర - నక్కపల్లి: ప్రభుత్వం విడుదల చేసిన ట్రిపుల్ ఐటి జాబితాలో మండలంలో 5గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఇవో కె.నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గొడిచెర్ల ఉన్న పాఠశాల నుండి ఎన్.వెంకట దుర్గ (580), కర్రి లహరి(576), జక్కా ఆదిత్య (564) మార్కులతో ఎంపికకాగా, నక్కపల్లి బాలికోన్నతపాఠశాల నుండి బి.సత్య పావని (575), గుతకాల బిందు(566) మార్కులతో ఎంపికయినట్లు తెలిపారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రామ ప్రతాప్, సుందరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నవధాన్యాల పంటలపై అవగాహన

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాకవరపాలెం మండలం జంగాలపల్లి గ్రామంలో వేగి శ్రీనివాసరావు, ఫీల్డ్ విజిట్ ఏపిఎం చినబాబు ఆధ్వర్యంలో నవధాన్యాలను వేయడం జరిగింది. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ 30 రకాల విత్తనాలు పొలాల్లో వేయడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. ఒక్కొక్క మొక్క ఒక్కొక్క పోషక విలువని కలిగి ఉంటుందన్నారు. మొక్క పెద్దది అయ్యాక పశువులకు రొట్టగా వేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కవిత, సుదర్శన, వేనమ్మ, సత్యవేణి, నూకరాజు పాల్గొన్నారు.

వాలంటీర్లకు అభినందన సభ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: 15 రోజులు పాటు పోలవరం పోరు కేక పాదయాత్ర నెల్లిపాక నుండి విజయవాడ వరకు జరిగింది. ఈ పాదయాత్రలో మండలం నుండి పాల్గొన్న వాలంటీర్లుకు అభినందన సభ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సోయం చినబాబు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. పోరు కేక పాదయాత్ర లో అనేక సమస్యలు బృందానికి ప్రజలు విన్నవించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడుతూ గ్రామ గ్రామాన నిర్వాసితులు పాదయాత్ర బృందానికి ఎదురేగి నీరాజనాలు పలికారని పాదయాత్రలో పాల్గొన్న వాలంటీర్లు ద్వారా వారి అభిప్రాయాన్ని సభలో వ్యక్తం చేశారు. అనంతరం మండలం నుండి పాల్గొన్న 94 మంది వాలంటీర్లకు మేమొంటోలను ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పూ నేమ్ సత్యనారాయణ, సోయం చినబాబు చేతులమీదుగా వాలంటీర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రేఖపల్లి వార్డు మెంబెర్ కట్టం లక్ష్మి, వెట్టి శ్రీను, తోడం అమరావతి కూర జోగయ్య, పోడియం గంగరాజు, కొవ్వాసి లక్ష్మణ్, రాధ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో మామిడిలోవ పంచాయతీ దబ్బంద గ్రామానికి చెందిన డెంకాడ అప్పన్న వయసు (65) ఈనెల 8న తోటలోకి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదని కుమారుడు గోవింద స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పన్నకు మతిస్థిమితం సరిగా ఉండదని అప్పుడప్పుడు ఇలా ఇంటి నుండి వెళ్లిపోతుంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే సుమారు వారం రోజులు కావస్తున్న ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళన చెందుతున్నామని కుటుంబ సభ్యులు కుమార్తె మరిడమ్మ, కుమారుడు గోవిందా ఆవేదన వ్యక్తం చేశారు. అప్పన్నకు ముగ్గురు కుమార్తెలు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆచూకీ తెలిసినవారు 8247881522, 8466937643 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసును ఆనందపురం పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్న సురక్ష

విశాలాంధ్ర - పెందుర్తి: సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష ఊళ్ళలో ఎలాంటి సమస్యలున్న తక్షణమే పరిష్కరించేందుకే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకం ప్రవేశపెట్టారని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు స్పష్టం చేశారు, 95వ వార్డు చీమలాపల్లిలో 499, 500, 501 సచివాలయ సిబ్బందితో ఆయన ప్రత్యేకంగా సమా వేశమయ్యారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ఏ చిన్న సమస్య తలెత్తినా దాన్ని పరిష్కరించడానికి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, మండల స్థాయి సిబ్బంది, ఐఏఎస్ అధికారులు, సచివాలయం కన్వీనర్లు, గృహసారదులు కృషి చేయాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో జే.సి.ఎస్ ఇంచార్జ్ మనలత జోబ్ దాస్(చిన్ని), రాపర్తి మాధవరావు, సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన సంతోష్, బొడ్డు దేముడుబాబు, బొట్ట రాము, కంచిబోయిన వెంకటరావు, యల్లపు పరదేశినాయుడు, గొడ్డి శ్రీను, గంట్ల లక్ష్మి, పులమరశెట్టి లక్ష్మణ్, బి.జగదీశ్, భాగ్యలక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ సర్వీసులు లేక అవస్థలు



విశాలాంధ్ర - దేవీపట్నం: ఒకప్పుడు రోజుకు నాలుగు పర్యాయాలు తిరిగే బస్సు సర్వీసులు అకారణంగా కుదించేసి పూర్తిగా ఆర్టీసీ సేవలు నిలిపేయటంతో రోజూ వందలాదిమంది రాకపోకలు సాగించే ఆ మార్గంలో రాకపోకలకు జనం అవస్థలు పడుతున్నారు. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలోని పోశమ్మగండి, పూడిపల్లి, దేవారం గ్రామాలకు గోకవరం ఆర్టీసీ డిపో నుండి రోజుకు నాలుగు పర్యాయాలు ఆర్టీసీ సేవలు ప్రజలకు, వ్యాపారస్తులకు, విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేవి. కాలక్రమేణా జనంపై ప్రేమ పెరిగిన ప్రభుత్వ సంస్థ ఆర్టీసీ ఆ సేవలను క్రమేపి కుదించటం కాదు కదా పూర్తిగా తొలగించింది. దాంతో రోజు వివిధ పనుల మీద గోకవరం రాజమండ్రి ఇతర దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులతో పాటు ఉన్నత చదువులు చదువుకొనే విద్యార్థినీ విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. చెప్పుకుంటే తీర్చే నాథుడు లేక వందలాది రూపాయలు వెచ్చించి ప్రయాణాలు చేయలేక నానావస్థలు పడుతున్నారు. ఇంటర్ డిగ్రీ చదువులకు తప్పనిసరిగా గోకవరం రాజమండ్రి వంటి దూర ప్రాంతాలకు వెళ్ళటం తప్పని సరి. ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ట్రిబుల్ ఐటీకి కేజీబీవీ విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - ఆనందపురం; మండలంలో నేల్తేరు గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ పాఠశాలల్లో చదువుకున్న, ఎన్ భారతి, ఈ.రేవతి అను ఇద్దరు 10వ తరగతిలో 600 మార్కులకు గాను 585 పైగా మార్కులు సాధించడం వల్ల విద్యార్థినులు నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. విద్యార్థులు ఎంపిక అవడం పట్ల ప్రిన్సిపల్ చంద్రకళ ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ తో పాటు సిబ్బంది అభినందించారు. అలాగే గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న కోట్ల హరిత అనే విద్యార్థిని కూడా శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. విద్యార్థి ఎంపిక పట్ల పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

వాతావరణ మార్పుల అంశంపై జర్నలిస్టులకు శిక్షణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: అమెరికన్ కాన్సులేట్ జనరల్, ఒడిశాకు చెందిన వ్యూస్ సంస్థ సంయుక్తంగా ఆంధ్ర యూనివర్సిటీ అమెరికన్ కార్నర్ లో బుధవారం మీడియా రంగ ప్రతినిధులకు వాతావరణం మార్పులు వాటిని ప్రజలకు అందించే తీరును వర్క్ షాప్ నిర్వహించింది. దీనికి రిసోర్స్ పర్సన్‌గా హాజరైన టైమ్స్ అఫ్ ఇండియా ఆంగ్ల పత్రిక స్పెషల్ కరస్పాండెంట్ జిన్నాల ఉమామహేశ్వరరావు వాతావరణంలో జరుగుతున్న మార్పులు అందుకు గల కారణాలను సుదీర్ఘంగా వివరించారు. వాతావరణ మార్పులపై కథనాలను ఎంపిక చేసుకునే విధానం, దానికి డేటా సమకూర్చు కోవడం, ప్రజల్లో అవగాహన కల్పించడం మొదలైన అంశాలపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పాత్రికేయులకు వివరించారు. గ్లోబల్ వార్మింగ్, వాతావర ణంలోని మార్పులు నివారించడానికి వివిధ దేశాలు, భారతదేశం, మరియు ఆంధ్రప్రదేశ్ ఏ విధంగా కృషి చేస్తున్నాయో తన ప్రసంగంలో తెలిపారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌కి 970 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉండడం ఎన్ని అవకాశాలు సృష్టిస్తుందో, ఏదైనా తుఫాన్లు, తీర ప్రాంత కోత, సముద్ర మట్టం పెరిగిపోవడం, మొదలైన అంశాలు తీర ప్రాంత వాసులను మొదట ప్రభావితం చేస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ మెటలర్జీ విభాగ పూర్వాచా ర్యులు భాను కుమార్, జర్నలిజం విభాగాచార్యులు ఆచార్య డివిఆర్ మూర్తి, ఆచార్య చల్లా రామ కృష్ణ, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహనకు పీ అండ్ జీ 'నా నా ఎనీమియా బస్సు యాత్ర'

విశాలాంధ్ర - విశాఖ సిటీ: గత సంవత్సరం భారతదేశంలోని ఉత్తరాది ప్రాంతంలో 'నా నా ఎనీమియా బస్సు యాత్ర'ను విజయవంతంగా చేపట్టిన పీఅండ్‌జీ హెల్త్, ఫాగ్సి (ద ఫెడరేషన్ ఆఫ్ అబ్స్టెట్రిక్ అండ్ గైనకలాజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా) సహకారంతో 'నా నా ఎనీమియా బస్సు యాత్ర 2.0' ను విశాఖలో గురువారం ప్రారంభించింది. భారతదేశంలోని దక్షిణాది ప్రాంతాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించే ఉద్దేశంతో 'నా నా ఎనీమియా బస్సు యాత్ర 2.0' చేపట్టినట్టు ఆ సంస్థ ప్రతినిధులు చెప్పారు. ఐరన్ డెఫిషియెన్సీ ఎనీమియా (ఐడీఏ)పై అవగాహన పెంచుతుందన్నారు. విశాఖపట్నంలో ప్రాక్టర్ అండ్ గాంబుల్ హెల్త్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మిళింద్ థాటే, ఫాగ్సి ప్రెసిడెంట్ డాక్టర్ హృషికేశ్ పాయ్ కలిసి ప్రారంభించిన ఈ యాత్ర ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ మీదుగా సాగి బెంగళూరులో ముగుస్తుంది. ఈ సందర్భంగా ప్రాక్టర్ అండ్ గ్యాంబుల్ హెల్త్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మిలింద్ థాటే మాట్లాడుతూ, "ఈ ఏడాది 'నా నా ఎనీమియా బస్సు యాత్ర 2.0'ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో రక్తపోటు పరీక్షలతో పాటు, 2000 మందికి పైగా వ్యక్తులకు ఉచితంగా గైనకాలజిస్ట్ / ఫిజీషియన్ ద్వారా స్క్రీనింగ్ పరీక్షను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా మన్నారు. భారతదేశంలో ఐరన్ లోపంపై అవగాహన పెంచడానికి, దీనిపై పూర్తి విజ్ఞానం అందించేందుకు పి అండ్ జి హెల్త్ అంకితమైందని, గత సంవత్సరం ఉత్తర భారత నగరాలలో నా నా ఎనీమియా బస్సు యాత్ర ద్వారా గణనీయమైన సంఖ్యలో ప్రజలు ఈ అవగాహన కార్యక్రమాన్ని ఉపయోగించుకున్నారని, ఇప్పుడు భారతదేశంలోని దక్షిణ ప్రాంతాలకు కూడా విస్తరించడానికి, ఐడీఏ ప్రారంభ లక్షణాలను గుర్తించడానికి, వాటిని అధిగమించడానికి చర్యలు తీసుకోవడానికి ప్రజలను శక్తివంతం చేయడానికి ఆ విజయం మమ్మల్ని ప్రోత్సహించింది" అని తెలిపారు.

వరదల పట్ల అప్రమత్తత ఏది..?

విశాలాంధ్ర - కూనవరం: గతేడాది ఇదే రోజుల్లో ఊళ్ళకు ఊళ్ళు జలసమాధి అయ్యాయని, సరైన ప్రణాళిక అప్రమత్తత లేక ప్రజలు నానా అవస్థలు పడ్డారని, ఈ ఏడాది కనీసం వరదల పట్ల అప్రమత్తత గాని వరద సమీక్ష సమావేశాలు కానీ నిర్వహించడం మానేశారని సిపిఐ డివిజన్ సెక్రెటరీ మోహన్‌రావు అన్నారు. అకస్మాత్తుగా వచ్చి పడిన వరదలకు సర్వం కోల్పోతే ప్రజలను ఆదుకోవడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని, కనీసం ఈఏడాదైనా ముందస్తు జాగ్రత్తచర్యలు చేపట్టే విషయంలో కూడా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ముంపు మండలాల ప్రజల పట్ల అధికారులకు ఉన్న నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం అన్నారు. అప్పటికప్పుడు ఎన్ డి ఆర్ ఎఫ్ దళాలను మోహరించి మనుషుల్ని మాత్రమే చేరవేయడం కంటే ముందస్తుగానే పునరావాస ప్రాంతాలలో షెల్టర్లు ఏర్పాటు చేసి ముంపు ప్రాంతం ప్రజలను ముందుగానే షెల్టర్లకు తరలిస్తే ఆస్తి నష్టం తీవ్రతను తగ్గించవచ్చని ఆయన ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఆ బాధ్యత తీసుకోకపోవడం వల్ల ఎవరికివారు మెరక ప్రాంతాలకు వెళ్లి వేలాది రూపాయలు అద్దె చెల్లించి ముందుగా ఇళ్లను బుక్ చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, పేద మధ్యతరగతి ప్రజలకు అది పెను భారంగా మారిందని ఆయన అన్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం ఇకనైనా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

వాలంటీర్లకు గుర్తింపునిచ్చింది జగనన్నే

విశాలాంధ్ర - జి.మాడుగుల: రాష్ట్రంలో వాలంటీర్లకు గుర్తింపునిచ్చింది జగనన్నేనని ఎంపీటీసీ గబ్బాడి సన్యాసి దొర అన్నారు. జి.మాడుగుల మండలం పెదలువ్వాసింగి గ్రామ సచివాలయం పరిధిలోని గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిదులుగా పాల్గొని టోకెన్లు జనరేట్ చేసుకున్న వారికి సర్టిఫికెట్లను చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గబ్బాడి సన్యాసి దొర గారు పాల్గొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి కారకులైన వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయం సిబ్బందికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. సంక్షేమ పథకాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తితే జగనన్న సురక్ష ద్వారానూ, గ్రామాలలో త్రాగునీరు, డ్రైనేజీ, సిసి రోడ్లకు తదితర సమస్యలు ఏమైనా ఉంటే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పరిష్కారాన్ని కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొండపల్లి సుబ్బలక్ష్మి, స్థానిక ఎంపిటిసి గబ్బాడి సన్యాసి దొర, తహసీల్దార్ అప్పలస్వామి, సూపర్ సర్పంచ్ కొండపల్లి సత్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షులు నూర్మనీ మత్యకొండంనాయుడు, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు సురబంగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - చింతపల్లి: చెరువులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పెదబరడ పంచాయతీ తెరపల్లి చెరువులో చోటుచేసుకుంది. మండలంలోని పెదబరడ పంచాయతీ పరిధిలోని తెరపల్లి, రబ్బురుగొంది గ్రామాల మధ్య ఉన్న చెరువులో గుర్తు తెలియని మృతదేహం అటుగా వెళ్లే గ్రామస్తులకు కనిపించడంతో విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఎస్ఐ అరుణ్ కిరణ్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వయసు 30 నుంచి 35 ఏళ్ళు మధ్య ఉండవచ్చన్నారు. మృతుడు నీలం రంగు ప్యాంటు వేసుకున్నారని, మృతి చెందిన వ్యక్తిని గుర్తుపట్టిన వారు చింతపల్లి పోలీస్ స్టేషన్ 94409042838 ఫోన్ నెంబర్ కి సమాచారం అందించాలని ఆయన కోరారు.

పవన్ కళ్యాణ్‌కు వలంటీర్లు క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర - అరకులోయ: జనసేన అధినేత పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు వాలంటీర్లు తక్షణమే క్షమాపణ ఆయనపై పెట్టిన కేసులు వెనక్కి తీసుకోవాలని నిజాలు మాట్లాడితే కేసులు పెడతారా జనసేన అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి మాదల శ్రీరాములు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు ముదు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీ అధినేతపై రాష్ట్ర వ్యాప్తంగా వాలంటీర్లు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై కేసులు పెట్టడం అసభ్యకరంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. పవన్ కళ్యాణ్ మాట్లాడిన మాటలు వాలంటరీలు సరిగ్గా అర్థం చేసుకోవాలని ఆయన హితవు పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కూడ వెంటనే పవన్ కళ్యాణ్‌కు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేసారు.

వివాదంలో వెంకటేశ్వర స్వామి ఆలయం

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో ఉన్న బోయినవారి చెరువులో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్మించేందుకు పునాదుల స్థాయి వరకు నిర్మించారు అయితే చెరువు గర్భంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదంటూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ అధికారులు గురువారం ఆలయం నిర్మించే ప్రాంతాన్ని సందర్శించారు. అయితే జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు మేరకు నిర్మించిన ప్రాంతాన్ని ధ్వంసం చేయడం జరుగుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

క్రైస్తవులపై దాడులకు వ్యతిరేకంగా కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ క్రిస్టియన్ జేఏసీ విశాఖపట్నం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం విగ్రహం నుంచి జైల్ రోడ్డు డాబా గార్డెన్స్ జగదాంబ జంక్షన్, జడ్జి కోర్టు సింగ్ హోటల్ జంక్షన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ పాల్గొన్నారు. క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ విశాఖపట్నం అధ్యక్షులు ఎంఏ అనిల్ పాల్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని పలు క్రైస్తవ సంఘాలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. జాన్ వెస్లీ మాట్లాడుతూ ఇప్పటికే మణిపూర్లో రెండు నెలలుగా జరుగుతున్న ఈ మారణ హోమంలో 122 మంది ప్రాణాలు కోల్పోయారని 60 వేల మంది నిరాశ్రయులయ్యారని ఎన్నో గ్రామాలు ప్రజలు తమ ఊర్లు విడిచి వెళ్లిపోవడం జరిగిందని ఇలాంటి పరిస్థితి మునిపెన్నడు ఏ రాష్ట్రంలోనూ లేదని ఈ యొక్క మరణ హోమాన్ని ఆపే దిశగా కేంద్ర ప్రభుత్వం మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



విశాలాంధ్ర - కూనవరం: సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిసిఎస్ మండల ఇన్చార్జి ఆవుల మరియదాసు, ఎంపీపీ పాయం రంగమ్మ అన్నారు. కొండ్రాజుపేట గ్రామంలో గురువారం సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా లంచాలకు వివక్షకు తావు లేకుండా నూటికి నూరు శాతం సంతృప్తి స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించాలన్నదే ఈ కార్యక్రమం ప్రథమ ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కే.అనసూర్య, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, స్థానిక సర్పంచ్ కట్టి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

గ్రావెల్ ట్రాక్టర్ పట్టివేత



విశాలాంధ్ర - పాయకరావుపేట: పోలవరం కాలువ నుండి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలవరం కాలువ వాటర్ సోర్స్ డిపార్టుమెంటు ఏఈ కె.సుబ్రమణ్యం పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఇటీవల కాలంలో పోలవరం కాలువ నుండి ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న విషయం తెలిసిందే. ఈమేరకు స్థానిక రాజీవ్‌నగర్ కాలనీ రైల్వేగేటు వద్ద అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టర్‌కు రూ.10వేలు అపరాధ రుసుం విధించారు.